క్లుప్తంగా

సేవలతోనే గుర్తింపు



బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

గార : ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించిన ఉద్యోగుల సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి అన్నారు. రామచంద్రాపురం పంచాయతీలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఆరుగురు ఉద్యోగులను శుక్రవారం సచివాలయంలో సన్మానించారు. వీఆర్వో చక్రవర్తి, శిమ్మపేట పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.లక్ష్మీ, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.వరుణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.మైత్రేయ, వీహెచ్ఏ ఎస్.ప్రియాంక, ఏఎస్ఎం జి.భూలక్ష్మీలకు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, వీఆర్వో నీలకంఠం, కార్యదర్శి ఎం.రాము, అంబటి చక్రధరరావు, అంబటి లింగమూర్తి, సాధు మల్లికార్జున, జయరాందాస్‌నాయుడు, కుంచాల సురేష్, శీర సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల నిర్ధారణకు స్వామిత్వ సర్వే



అధికారులుతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్

గార: గ్రామాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలను స్వామిత్వ సర్వేలో భాగంగా సాంకేతికంగా నిర్ధారణ చేస్తున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పంచాయతీలో సార్వత్రిక ఎన్నికల ముందు తొలి విడతలో జరిగిన సర్వే తీరును ఆయన పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠం భూములు గుర్తించి ఆన్‌లైన్ చేస్తారని, ఆక్రమణలు గుర్తింపునకు సర్వే ఉపయోగపడుతుందన్నారు. స్థల యజమానులకు కార్డులు అందజేస్తామరు. అనంతరం డ్రోన్ సర్వే ద్వారా జరిగిన మ్యాపును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.రాము, వీఆర్వో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

మెట్ల బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: గార మండలం నిజామాబాద్‌లో 1640లో షేర్ మహమ్మద్‌ఖాన్ నిర్మించిన అతిపెద్ద మెట్ల బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇంటాక్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. బావి చరిత్ర, విశిష్టతలను ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు వివరించారు. బావి పునరుద్ధరణకు తమ వంతు సహకారం అందిస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు, సీనియర్ సభ్యులు కొమ్ము రమణమూర్తి పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ హరిత సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటేశ్వర కాలనీ, వెంకటరావుపేట గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు, కార్యదర్శి పి.తవిటినాయుడు, సభ్యులు గొర్లె అప్పలనాయుడు, ఆర్.భవాని, ఎం.అప్పలనాయుడు, ఆర్.దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

24న మట్టి విగ్రహాల తయారీపై పోటీలు

శ్రీకాకుళం కల్చరల్ : మట్టి విగ్రహాల తయారీకి సంబంధించి ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్నారు. అలాగే జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక మందిరంలో 3 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు ఆదివారం ఉదయం 10 గంటలకు పోటీలు జరుగుతాయి.

ఉచితంగా విగ్రహాల పంపిణీ..

మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 9గంటలకు మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రత కథ పుస్తకాలను ఉచింతంగా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మంగువారితోటలోని సంపత్ వినాయక దేవాలయం వద్ద అదే రోజు ఉదయం 9 గంటల నుంచి మట్టి వినాయక మూర్తులను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ నెల 26న ఉదయం 9గంటలకు పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం వద్ద విజిలెన్సు ఎస్పీ బర్ల ప్రసాదరావు చేతుల మీదుగా విగ్రహాలు పంపిణీ చేస్తామని నిర్వాహకులు ఇప్పిలి హరి తెలిపారు.

సరుగుడు సాగుపై ఆసక్తి



లావేరు మండలం మురపాకలో వరికి బదులుగా వేసిన సరుగుడు పంట

- వరి, చెరుకు పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం

ఎచ్చెర్ల: రైతులు సంప్రదాయ పంటలకు కాస్త విరామం ఇస్తున్నారు. వరి, చెరుకు వంటి పంటలకు ప్రత్యామ్నాయంగా సరుగుడు, నీలగిరి వంటి తోటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. సంప్రదాయ పంటలతో పోల్చితే సాగు వ్యయం తక్కువగా ఉండటం, ఒకసారి నాట్లు వేసి మొక్క పెరిగే వరకూ సంరక్షిస్తే నాలుగేళ్లలో తోట కోతకు రావడంతో రైతులకు రాబడి ఆశించిన మేరకు వస్తోంది. వరి, చెరకు సాగు చేపట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ తెగుళ్లు, సాగునీటి కష్టాలు రైతులు ఎదుర్కోక తప్పడం లేదు. దీంతో వాటి స్థానంలో తక్కువ పెట్టుబడి అయ్యే సరుగుడు సాగుపైనే మొగ్గు చూపుతున్నారు.



అజ్జరాంలో సరుగుడు తోట

ఇదీ పరిస్థితి..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సుమారు 1500 ఎకరాల్లో సరుగుడు, నీలగిరి సాగు చేస్తున్నారు. చెరకు ఎకరానికి పెట్టుబడి రూ.35 నుంచి రూ.45 వేలు కాగా దిగుబడి 13 నుంచి 14 టన్నులు మాత్రమే వస్తోంది. దీంతో పెద్దగా పెట్టుబడులు అవసరం లేని, నాలుగేళ్లలో పెద్ద మొత్తంలో ఆదాయం ఒకేసారి వచ్చే సరుగుడు, నీలగిరిలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. చెరకు టన్ను ధర రూ.3,150 అయితే సరుగుడు, నీలగిరి టన్ను ధర రూ.7 వేలు నుంచి రూ.9 వేల వరకూ పలుకుతుంది. ఎకరా సాగుకు రూ.50 వేలు అయితే నాలుగేళ్ల తరువాత ఎకరాకు 45 టన్నుల నుంచి 70 టన్నుల దిగుబడి వస్తోంది. సుమారు రూ.4 లక్షల ఆదాయం సమకూరుతుంది. దీంతో సాగు చేసేవారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తుంది.

చెరకుతో పోలిస్తే లాభమే



చెరకు పంటకు ఎకరానికు సుమారు రూ. 40 వేలు పెట్టుబడి అవసరం. ఇందుకు అప్పులు కూడా చేయాలి. అన్నీ అనుకూలిస్తే రూ. 50 పైబడి ఆదాయం ఉంటుంది. పెట్టుబడికి తగ్గ ఆదాయం ఉండడం లేదు. చేసిన అప్పుకు వడ్డీ లెక్క వేస్తే ఆదాయానికి సరిపోవడం లేదు. ప్రత్యామ్నాయంగా సరుగుడు పంటలు వేస్తున్నాం.

– బొట్ట దాలినాయుడు, అజ్జరాం, ఎచ్చెర్ల

ఆదాయం బాగుంది..



సరుగుడు ఎకరాకు 45 నుంచి 70 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఆదాయం కూడా బాగానే వస్తోంది. ఖర్చు తక్కువ. నాలుగేళ్లల మంచి ఆదాయం వస్తుంది. సాగునీరు అవకాశం లేని ప్రాంతాల్లో ఈ పంట అనువుగా ఉంటుంది.

– రెడ్డి గోపాల్, రైతు, చిన్నయ్యపేట

పెంపకం సులభం



సరుగుడు మొక్కలు నాటి మొక్క బతికి ఎదిగే వరకూ కలుపు మొక్కలు తొలగించి సంరక్షించుకుంటే సరిపోతుంది. సరుగుడు ఒకసారి వేస్తే చాలు నాలుగైదేళ్లలో తోట ఎదిగి కోతకు వస్తుంది. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి పంట కొనుగోలు చేస్తారు. అంతరపంటలు కూడా వేసుకునే అవకాశం ఉంటుంది.

– గొర్లె దుర్గారావు, రైతు, మురపాక

దివ్యాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లలో పెద్ద ఎత్తున కోత విధించడం దుర్మార్గపు చర్య అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులుగా ఉన్న దివ్యాంగులకు పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు ఇవ్వడం దారుణమని దుయ్యబట్టారు. తాము పెన్షన్ పెంచమని అడగలేదని, అందరిలాగే రూ.4వేలు ఇస్తే చాలని, అంతేతప్ప ఆర్థిక భారం తప్పించుకునేందుకు అన్యాయం పింఛన్లు తొలగించడం అన్యాయమని చాలా మంది బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రూ.6వేలు చేసి నేడు అవే పింఛన్లు తొలగించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాదిన్నర గడిచినా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని మండిపడ్డారు. కొత్తవాటిని ఇవ్వకుండా నోటీసుల పేరుతో దివ్యాంగులను ఆస్పత్రులు, మండల పరిషత్ కార్యాలయాల చూట్టు తిప్పడం దౌర్భాగ్యపు చర్యగా అభివర్ణించారు. తక్షణమే దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి



తహశీల్దార్‌కు సమస్య వివరిస్తున్న రైతులు

జి.సిగడాం: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై వీఆర్‌ఓలు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ మహాదేవు సరిత సూచించారు. శుక్రవారం జి.సిగడాం రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలన్నారు. అనంతరం భూముల సమస్యపై మెట్టవలస, వెంకయ్యపేట గ్రామాల రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సమావేశంలో డీటీ ఎన్.నిర్మల, ఆర్ఎస్‌డీటీ కె.గాయత్రి, ఆర్ఐ ఎ.రాధ, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పొట్నూరు జగన్నాథం, సీతయ్య తదితరులు ఉన్నారు.

సచివాలయానికి దారేదీ?



జి.సిగడాం మండలం సీతంపేట గ్రామ సచివాలయం పరిసరాలు అధ్వానంగా మారాయి. కార్యాలయానికి సరైన దారి లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది.

- జి.సిగడాం

సామాన్యులకు అందుబాటులో బ్యాంకింగ్ సేవలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం అర్బన్: బ్యాంకింగ్ రంగంలో ఇండియన్ బ్యాంకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాన్ని అందుబాటులోకి తెచ్చి సామాన్యులకు సైతం అందుబాటులో సేవలు విస్తరించడం అభినందనీయమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు అన్నారు. ఇండియన్ బ్యాంకు 119వ వార్షికోత్సవం శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయం మేడపై ఉన్న బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పొట్నూరు నాగేశ్వరరావు, బ్యాంకు అధికారులు మూల నారాయణరావు, రవళి, స్రవంతి, తిరుపతిరావు, మండా శ్రీనివాసరావు, గణేశ్వరరావు, గోపి, విశ్రాంత అధికారి నాగేశ్వరావు, తిరుపతిరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

శ్రీకాకుళం కల్చరల్: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రధాన కేంద్రంలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంక్ నేతృత్వంలో విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ప్రకాష్ మణి దాదీజీ జ్ఞాపకార్థం జరిగే ఈ శిబిరంలో ఎవరైనా స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు.

పూజా సామగ్రి షాపు లీజుకు వేలం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పాత బ్రిడ్జి సమీపంలో కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్ద పూజా సామగ్రి షాపును లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని ఈఓ శ్యామలరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించి పాటలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు ఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి జి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా దోమలు, లార్వాల నిర్మూలనకు ఖాళీ స్థలాలు, కాలువల్లో యాంటీ లార్వర్‌ను పిచికారీ చేయించారు. సర్పంచ్ గంగు నరేంద్రకుమార్, హెల్త్ అసిస్టెంట్ చిట్టిబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల లేమిపై డీఐజీ అసహనం



తరగతి గదులను పరిశీలిస్తున్న డీఐజీ, ఎస్పీ

శ్రీకాకుళం రూరల్ : తండేవలసలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ శుక్రవారం పరిశీలించారు. కనీస స్థాయిలో కూడా సదుపాయాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్స్ ఫలితాలు విడుదల చేయడంతో ఎంపికైన ట్రైనీ కానిస్టేబుళ్లకు (ఎస్‌సీటీపీసీ) మరికొద్ది రోజుల్లో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా కేంద్రాన్ని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్స్, వంట గదులు, వైద్యగది, పెరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించి అపరిశుభ్రత లోపించడంపై అసహనం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయనతో పాటు అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణ

శ్రీకాకుళం క్రైమ్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను నగర ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండప కమిటీలు బాధ్యత వ్యవహరించాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో మండపాలు పెట్టేందుకు మున్సిపాలిటీ/పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, మైకులు, సౌండ్‌బాక్సులకు డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : తన భర్త కనిపించడం లేదంటూ ఓ వివాహిత శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. కర్రవీధికి చెందిన వైశ్యరాజు మణికంఠ (33)కు రెండేళ్ల క్రితం ఒడిశా రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. సిగరెట్లు లైన్ వ్యాపారం చేసే మణికంఠ.. లక్ష్మికి తెలియకుండా బంగారు నెక్లెస్ తాకట్టు పెట్టాడు. ఈ నెల 20న కన్నవారింటినుంచి వచ్చిన లక్ష్మి నెక్లెస్‌పై భర్తను అడగ్గా వాగ్వాదం జరిగింది. 21న ఉదయం 7 గంటలకు భార్యకు చెప్పకుండా స్కూటీపై మణికంఠ వెళ్లిపోయాడు. బంధువులు వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో లక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

శ్రావణ శోభ

శ్రావణమాస చివరి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, సామూహిక కుంకుమ పూజలతో ఆలయాలు సందడిగా మారాయి.

- సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో తుల్జాభవానీ అమ్మవారు



జి.సిగడాం:పెంట గ్రామంలో దుర్గాదేవికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బలగలో సామూహిక కుంకుమ పూజలు

డ్వాక్రా సభ్యులకు వ్యాపార రుణాలు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం పేడాడ శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్ : డిజిటల్ సూక్ష్మరుణ ప్రణాళిక ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు వ్యాపార సంబంధిత రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం, గార మండలాల బ్యాంకర్ల సమావేశం జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇచ్చి అందులో 30 శాతం వ్యక్తిగత అవసరాల కోసం, 70 శాతం ఆదాయ వనరులు పెంచే యూనిట్లకు కేటాయించాలన్నారు. అర్హులైన కౌలు రైతు రుణాలకు రుణాలు అందించేందుకు సహకరించాలన్నారు. నాబార్డు డీడీఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ పంట రుణాలకు బీమా నమోదు చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ అధికారులు, ఏపీఎంలు, డీపీఎంలు మెప్మా అధికారులు, డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు.

సంపాదనంతా సేవకే..!



కొండబాబు నిర్మించిన ఆంజనేయస్వామి గుడి

- 25 ఏళ్లుగా దైవచింతన
- ప్రతి నెలా రెండో ఆదివారం అన్నదానం
- స్ఫూర్తిగా నిలుస్తున్న కొండబాబు

శ్రీకాకుళం కల్చరల్: నేటి ఆధునిక సమాజంలో సేవా తత్పరత కలిగిన వ్యక్తులు అరుదుగా కనిపిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి, అన్నార్తులకు సాయం చేసే వారే కరువైపోతున్నారు. ఇలాంటి తరుణంలో తమ సేవా కార్యక్రమాల ద్వారా కొందరు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ కోవకు చెందిన వారిలో శ్రీకాకుళం పట్టణంలోని పుణ్యపువీధికి చెందిన ముక్కాల కొండబాబు ముందు వరసలో ఉంటారు. తన సంపాదనంతా సేవ, దైవ కార్యక్రమాలకు వినియోగిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

దైవ కార్యక్రమాలకు పెద్దపీట..

కొండబాబు గ్రామీణ వికాస బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. విధి నిర్వహణలో ఉండగా తండ్రి 2001లో చనిపోయిన నాటి నుంచి దైవచింతన వైపు ఆయన ఆలోచనలు సాగాయి. ముందుగా తమ వీధిలో ఆంజనేయస్వామి గుడి కట్టించేందుకు సంకల్పించారు. తనతో పాటు మరికొందరు దాతల సాయంతో గుడి నిర్మాణం పూర్తిచేశారు. ఆలయం వెనుకనే సీతారామచంద్రమూర్తి విగ్రహాలను ఏర్పాటు చేసి రామోత్సవాలు, దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్తీకమాసంలో కోటి దీపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తుమ్మావీధిలో రామమందిర నిర్మాణం కోసం రూ.లక్ష సహాయం చేశారు. నానుబాల వీధిలో కొలువైన విజయదుర్గా అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.2.50లక్షల వరకు సాయం అందించారు.



అన్నం వడ్డిస్తూ..

ఆర్తుల ఆకలి తీరుస్తూ..

అన్నార్తుల ఆకలి బాధలు తీర్చాలనే ఉద్దేశంతో 2005 నుంచి అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. ప్రతి నెలా రెండో ఆదివారం వివిధ కూడళ్లలో టెంట్లు వేసి తాను స్వయంగా వడ్డిస్తూ పేదల ఆకలి తీరుస్తున్నారు. మొదట్లో రోడ్డుపై అన్నం పెడుతున్న సందర్భంగా పలు ఇబ్బందులు ఎదురుకావడంతో గుడి వెనుకనే ఉన్న స్థలాన్ని రూ.లక్షతో కొనుగోలు చేసి మరో రూ.లక్షా ముప్పైవేలు ఖర్చు చేసి మందిరాన్ని నిర్మించారు. అక్కడే అందరికి వంటలు వండి భోజనాలు పెడుతున్నారు. సుమారు 250 మందికి భోజనాలు వడ్డిస్తుంటారు. మదర్ థెరిసా ఆశ్రమంలోని అనాథలకు 70మందికి భోజనాలు వండి ట్రాలీ బండిపై పంపుతారు. బాటసారులను కూడా పిలిచి మరీ అన్నదానం చేస్తుంటారు. ఇతర ఆలయాల ఉత్సవాల సమయాల్లో తనవంతు సాయం అందిస్తారు.

నాకున్నదాన్ని నలుగురితో పంచుతున్నాను



సంపాదించిన మొత్తాన్ని నలుగురికి పంచుతూ నా వంతు సాయం చేస్తున్నాను. పదిమందికి అన్నం పెట్టడం, దైవకార్యాలు నిర్వహించడం, ఆర్థిక సహాయం చేయడం తృప్తినిస్తోంది.

– ముక్కాల కొండబాబు, పుణ్యపువీధి, శ్రీకాకుళం